సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



వీరోచిత పోరాటంతో విమోచనం
తెలంగాణ విమోచన ఉద్యమంలో జిల్లా నుంచి అనేక మంది వీరులు పాల్గొన్నారు. రజాకార్లపై ఫిరంగులతో దాడి చేశారు.
- 2లో ▸



జైలు నుంచి ఎగిసిన దేశభక్తి
తెలంగాణ విమోచనలో జైలు నుంచి ఉద్యమం ఎగిసింది. ఖిల్లా జైలు 'రాజకీయ ఖైదీల బొందల గడ్డ'గా పేరు పొందింది.
- 4లో ▸

వాతావరణం
గరిష్టం/కనిష్టం
29.5 /23.9

ఉదయం చలిగాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఓ మోస్తరునుంచి భారీ వర్షం కురిసే అవకాశాలు ఉన్నాయి.

న్యూస్‌రీల్

నేడు జాతీయ సమైక్యత దినోత్సవం
సుభాష్‌నగర్ : నగరంలోని కలెక్టరేట్‌లో తెలంగాణ జాతీయ సమైక్యత దినోత్సవ వేడుకలను ఆదివారం ఉదయం 9 గంటల కు నిర్వహించనున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర రోడ్లు, భవనాలు, శాసనసభ వ్యవహారాలశాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి హాజరుకానున్నారు. ఈసందర్భంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, ప్రసంగించనున్నారు.

బోర్గాంలో జిల్లా స్థాయి సైన్స్‌సెమినార్



మోపాల్ : నగర శివారులోని బోర్గాం(పి) జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం జిల్లా స్థాయి సైన్స్ సెమినార్ నిర్వహించారు. మిల్లెట్స్ -ఏ సూపర్ ఫుడ్ ఆర్ డెట్ ప్యాడ్ అనే ప్రధానాంశంలో మండల స్థాయి సెమినార్‌లో విజేతలుగా నిలిచిన విద్యార్థులు జిల్లా స్థాయిలో పాల్గొన్నారని జిల్లా సైన్స్ అధికారి గంగాకిషన్ తెలిపారు. ఇందులో మొదటి బహుమతి విస్డమ్ స్కూల్‌కు చెందిన 10వ తరగతి విద్యార్థి వెన్నెల , రెండవ బహుమతి విజయ్ హైస్కూల్ కు చెందిన ప్రేరణ , ముప్కాల్ జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన కార్తీకేయ సాధించారు. వీరు ఈనెల 19న హైదరాబాద్‌లో నిర్వహించే రాష్ట స్థాయి సైన్స్ సెమినార్‌లో పాల్గొననున్నారని గంగాకిషన్ పేర్కొన్నారు.

దేశభక్తి.. దైవభక్తి.. పార్టీ అభిమానం



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ర్యాలీలో పార్టీకి చెందిన ఒక అభిమాని ప్రదర్శించిన జెండా ఆకట్టుకుంది. వినాయక్‌నగర్ హనుమాన్ జంక్షన్ వద్ద దేశభక్తి, దైవభక్తి, పార్టీ అభిమానం చాటేలా జాతీయ పతాకం, అయోధ్య రాముడి జెండా, బీజేపీ జెండాలను ఒకే కర్రకు కట్టి ప్రదర్శించాడు.

- గర్వంగా చెప్పకునేలా చరిత్ర
- నిజాంపై పోరులో పాల్గొన్న 700 మందికి పైగా వీరులు
- 'నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని దాశరథి కృష్ణమాచార్యులు నినదించింది ఖిల్లా జైలు నుంచే
- 'ఇతిహాస సంకలన సమితి' ఆధ్వర్యంలో జిల్లా చరిత్రపై 2వేల పుస్తకాలతో డిజిటల్ లైబ్రరీ ఏర్పాటుకు ప్రయత్నాలు
- 'సాక్షి' కథనంతో కూడిన పేజీతో ఇటీవల 'ఒక స్వాతంత్ర్య సమరయోధుని ఆత్మకథ' విడుదల





ఖిల్లాలోని దాశరథి ఉన్న జైలు గది

1948, సెప్టెంబర్ 17

విముక్తి పోరులో ఇందూరు వీరులు!

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : తెలంగాణ విముక్తి కోసం నిజాం నవాబుపై ప్రాణాలకు తెగించి జరిపిన పోరాటంలో ఇందూరు జిల్లాకు చెందిన 700 మందికి పైగా వీరులు పాల్గొన్నారు. ఇందులో పలువురు అసువులు బాసారు. సెప్టెంబర్ 17, 1948లో తెలంగాణ గడ్డపై త్రివర్ణ పతాకం రెపరెపలాడింది. భారతదేశానికి 1947 ఆగస్టు 15న బ్రిటిష్ వాళ్ల నుంచి స్వాతంత్ర్యం లభించినప్పటికీ తెలంగాణ మాత్రం అదనంగా మరో 13 నెలల పాటు వీరోచిత పోరాటం చేయాల్సి వచ్చింది. ఈ క్రమంలో నిజాంకు వ్యతిరేకంగా రాసిన సాహిత్యం ప్రధాన పాత్ర పోషించింది. అనేక మంది కవులను వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చిన నిజాం పాలకులు కొంతకాలం పాటు నిజామాబాద్ ఖిల్లా జైలులో బంధించారు. ఇలా బంధించబడిన వారిలో దాశరథి కృష్ణమాచార్యులు, వట్టికోట ఆళ్వార్ లాంటివారు ఉన్నారు. దాశరథి కృష్ణమాచార్య నిజామాబాద్ జైలులో మూడు నెలల పాటు ఉన్నట్లు సమాచారం. ఈ సమయంలో దా శరథి జైలు గోడలపై పళ్లు తోముకునే బొగ్గుతో ని జాం పాలనకు వ్యతిరేకంగా సాహిత్యాన్ని రాశారు. 'నా తెలంగాణ కోటిఅందాల జాణ.. నా తెలంగాణ కోటి రతనాల వీణ' అని గో డలపై రాశారు. నిజాం, రజాకార్లపై ఏళ్లతరబడి చేసిన, పోరాటం, పోరాడిన వీరుల గురించి 'నిజామాబాద్ జిల్లా స్వాతంత్ర్యోద్యమ చరిత్ర' పుస్తకాన్ని 1997లో ఎ పండరినాథ్ రాశారు. 'ఇందూరు సీమ విజ్ఞాన సర్వస్వం' పుస్తకాన్ని శాస్త్రుల రఘురామ శాస్త్రి 2005లో రాశారు. ఈ క్రమంలో ఇందూరు ఘన చరిత్రకు సంబంధించిన సాహిత్యంతో కూడిన డిజిటల్ లైబ్రరీని నగరంలో ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇటీవల నల్ల రుక్మారెడ్డి 'ఒక స్వాతంత్ర్య సమరయోధుని ఆత్మకథ' పుస్తకాన్ని విష్కరించారు. ఇందులో కవర్‌పేజీ 2లో 'సాక్షి' పత్రికలో 2022 సెప్టెంబర్ 16న ప్రచురితమైన కథనాన్ని ముద్రించారు.



మాణిక్‌రెడ్డి బెల్లాల్



ఇందూరులోని గాజుల్‌పేట్‌కు చెందిన బెల్లాల్ మాణిక్‌రెడ్డి నిజాం రజాకార్ల వ్యతిరేక పోరాటంలో కీలక పాత్ర పోషించారు, న్యాయవాద విద్యనభ్యసించిన మాణిక్‌రెడ్డి ఆర్యసమాజ్ బృందాలతో కలిసి ఇందూరు యువకులకు రాత్రి సమయాల్లో కర్రసాము, కరాటే, నాటు తుపాకీ వాడకం, బాంబుల తయారీలో శిక్షణ ఇచ్చారు. పోరాట యోధులను కనిపిస్తే కాల్చేయమని నిజాం పోలీసులు ఉత్తర్వులు జారీ చేసిన సమయంలో అనేకమంది వీరులకు తన పొలంలో, ఇంట్లో ఆశ్రయం కల్పించి వారి బాగోగులు, వారి కుటుంబాల బాగోగులు చూసుకున్నారు. మాణిక్‌రెడ్డి ఇల్లు స్వాతంత్ర్య ఉద్యమకారులకు భోజన సత్రంగా ఉండేదని నాటి సమర యోధులు చెప్పేవారు. రజాకార్లకు వ్యతిరేకంగా జరిగిన నిరసన ర్యాలీలు, సత్యాగ్రహ దీక్షల్లో ముందుండి నాటి యువకులకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ క్రమంలో జైలుకు వెళ్లారు. తరువాత కాలంలో ఎమర్జెన్సీ సమయంలోనూ మాణిక్‌రెడ్డి అప్పటి ఇందిర ప్రభుత్వానికి వ్యతిరేకంగా అన్ని పోరాటాల్లో ముందున్నారు. చంపేస్తామని అప్పటి కాంగ్రెస్ నాయకులు బెదిరించినప్పటికీ వెరవలేదు.

త్రయంబకరావు పాఠక్



త్రయంబకరావు పాఠక్ 1920 డిసెంబర్ 1న ఇందూరులో జన్మించారు. తల్లిదండ్రులు అందూబాయి, రామచంద్రరావు. వ్యవసాయ కుటుంబం. ఉపాధ్యాయ వృత్తిని చేపట్టిన పాఠక్ రజాకార్ల అరాచకాలను చూడలేకపోయారు. హృదయవిదారక ఘటనలు చూసి విప్లవ భావాలు పెంచుకున్నారు. ఆ కసాయివాళ్లను ఆయుధాలతోనే ఎదురించాలనుకుని, తన భార్య గాజులను అమ్మేసి హైదరాబాద్ చేరుకున్నారు. హైదరాబాద్‌లో తన మిత్రుడు దత్తోపంత్‌తో బాంబులు తయారు చేయించారు. ఇందుకు సీహెచ్‌బీ విఠల్‌దాస్, కేవీ గంగాధర్‌లు సహకరించారు. అయితే బాంబులను రహస్యంగా చేరవేస్తున్నప్పుడు పేలుడు సంభవించి దత్తోపంత్ అనే సమరయోధుడు మరణించారు. ఇది పోలీసులకు తెలియడంతో అందరినీ బంధించి వేర్వేరు జైళ్లలో బంధించారు. త్రయంబకరావును 1947 డిసెంబర్ 14న హైదరాబాద్ జైల్లో పెట్టారు. 1948 అక్టోబర్ 7న విడుదలయ్యారు. స్వాతంత్ర్య సమరంలో ఈయన పాత్రను గుర్తించిన భారత ప్రభుత్వం 1973 ఆగస్టు 15న తామ్రపత్రాన్నిచ్చి గౌరవించింది. పాఠక్ ఆనాడు నిజామాబాద్ ప్రాంతంలో జరిగిన అన్ని ఉద్యమాల్లో పాల్గొన్నారు. హిందూ మహాసభకు జిల్లా కార్యదర్శిగా, ఆర్యసమాజ్ సభ్యులుగా వ్యవహరించారు. తరువాత భారత్ సేవక్ సమాజ్‌లోనూ, రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌లోనూ, కాంగ్రెస్ పార్టీ, జనతా పార్టీలలో సభ్యులై ఎన్నో కార్యకలాపాలను నిర్వహించారు.

అమరుల్లో కొందరి గురించి..

నరసింహారెడ్డి నల్ల



1931లో హైదరాబాద్ రాష్ట్రంలో సాగిన 'సివిల్ డిస్ ఒబిడియెన్స్' ఉద్యమంలో నల్ల నరసింహారెడ్డి అరెస్టయ్యారు. ఇక 1947లో హైదరాబాద్ రాష్ట్ర విలీనోద్యమంలో చాలా చురుకుగా పాల్గొన్నారు. దీంతో రజాకార్లు క్రూరంగా కాల్చి చంపారు. ప్రస్తుతం నిజామాబాద్‌లో నల్ల నర్సింహారెడ్డి పేరుతో ఒక వీధి వ్యవహరించబడుతోంది. జిల్లా స్వాతంత్ర్య సమరయోధుల సంఘం వారు నగరంలో ఈయన పేరిట ఒక స్థూపాన్ని ప్రతిష్ఠించారు.

నరసారెడ్డి మామిడి




మామిడి నరసారెడ్డి ఆర్మూర్ తాలూకాలోని నాగాపురం గ్రామంలో వ్యవసాయ కుటుంబంలో 1909 లో జన్మించారు. హైదరాబాద్ రాష్ట విమోచనోద్యమంలో పాల్గొన్నారు. ఆ రోజుల్లో వార్తాపత్రికలు చేతుల్లో కనిపిస్తేనే జైల్లో పెట్టేవారు. అలాంటి తరుణంలో నరసారెడ్డి ప్రతాప్ అనే పత్రికను తమ స్వగ్రామానికి తెప్పించారు. నిజాం ప్రభుత్వం బంధించి జైల్లో బంధించింది. నిజామాబాద్ జైల్లో 1947 ఫిబ్రవరి 28 నుండి 1948 ఏప్రిల్ 23 వరకు ఉన్నారు. 1973 ఆగస్టు 15న భారత ప్రభుత్వం ఈయనకు తామ్రపత్రం ఇచ్చి సత్కరించింది. ఆయన జీవితాంతం అనేక సామాజిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొన్నారు.

గంగారాం మిఠాయి(ఎం.జి)



మిఠాయి గంగారాం 1921లో నిజామాబాద్‌లో జన్మించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా తన వృత్తినే వదిలేసి పాల్గొన్నారు. ఆనాటి ఉద్యమంలో వీరి పాత్ర అమోఘమైనది. ఎవరికీ జంకని వీరపురుషుడీయన అంటారు. నైజాం ప్రభుత్వం గంగారాంను హైదరాబాద్, సికింద్రాబాద్ జైళ్లలో విడతల వారీగా ఉంచింది. 1947 జూలై 5 నుంచి 1948 అక్టోబర్ 7 వరకు జైలులో ఉన్నారు. జైలులో అనేక అవస్థలు పడ్డారు. జైలు నుండి విడుదలైన తరువాత గంగారాం అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టారు.
ఆర్యసమాజ్, విశ్వహిందూ పరిషత్ కార్యకలాపాల్లో, హనుమాన్ వ్యాయామశాల స్థాపన నిర్వహణలో కృషి చేశారు.

గోపాల్‌రెడ్డి లోక



అప్పటి నైజాం, బ్రిటీష్ రోజుల్లో త్రివర్ణ పతాకాన్ని ఎగరేయాలంటే సాహసంతో కూడుకున్న పని. అలాంటి చర్యకు పూనుకున్నాడు ఆర్మూర్ తాలూకాలోని ధర్మోరాకు చెందిన యువకుడు లోక గోపాలరెడ్డి. హైదరాబాద్ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో నిజాం ప్రభుత్వాన్ని ఎదురించి యువకులంతా జెండాలను ఎగురవేసే మహత్తరమైన పనికి పూనుకున్నారు. వార్తను విన్న గోపాల్‌రెడ్డి తన ఊళ్లో ధైర్యంగా జెండా ఎగరేశారు. నిజాం ప్రభుత్వం గోపాల్‌రెడ్డిని బంధించి 1947 సెప్టెంబర్ 4న నిజామాబాద్ జైల్లో పెట్టింది. జైల్లో ఇబ్బందులు పెట్టారు. 1948 ఏప్రిల్ 21న జైలు నుంచి విడుదలయ్యారు. 1973 సెప్టెంబర్ 14న భారత ప్రభుత్వం తామ్రపత్రం ఇచ్చింది.

పారదర్శకంగా ఓటరు తుది జాబితా

- పరిశీలకులు క్రిస్టీనా జెడ్ చోంగ్తూ
- బోగస్ ఓటర్లపై విచారణ : కలెక్టర్



మాట్లాడుతున్న పరిశీలకులు క్రిస్టీనా

సుభాష్‌నగర్: పొరపాట్లకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా ఓటర్ల జాబితా రూపకల్పన జరగాలని ఓటరు జాబితా పరిశీలకులు, రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టీనా జెడ్‌చోంగ్తూ సూచించారు. శనివారం ఆమె కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి నిజామాబాద్‌లోని మోడ్రన్ పబ్లిక్ హైస్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. రెండో విడత ఓటరు నమో దులో వచ్చిన దరఖాస్తులు, మార్పులు, చేర్పుల తీరును పరిశీలించారు. జిల్లాలో చేపట్టిన ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాల నిర్వహణను లెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు వివరించారు. 18 – 19 ఏళ్లు కలిగిన కొత్త ఓటర్ల నుంచి స్పందన ఎలా ఉందని క్రిస్టీనా ఆరా తీశారు. కలెక్టరేట్‌లో గల కాన్ఫరెన్స్ హాల్‌లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి క్రిస్టీనా గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమ, నిబంధనలు పాటిస్తూ, పక్కాగా ఓటరు జాబితా రూపకల్పన జరిగేలా కృషి జరుగుతోందన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకారం అందించాలని కోరారు. బోధన్, నిజామాబాద్ నియోజకవర్గాల పరిధిలో బోగస్ ఓటర్ల నమోదుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని పలువురు రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలుపగా, క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలతో క్షుణ్ణంగా విచారణ జరిపిస్తున్నామని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు వివరించారు. బోగస్ ఓటర్లకు ఆస్కారం లేకుండా పక్కాగా తుది జాబితా రూపొందేలా రాజకీయ పార్టీలు క్షేత్ర స్థాయిలో దృష్టి పెట్టాలని పరిశీలకులు సూచించారు. ఈనెల 19లోపు కొత్త ఓటర్లందరూ పేర్లు నమోదు చేసుకునేలా ప్రచారం చేయాలన్నారు. అదనపు కలెక్టర్లు పి యాదిరెడ్డి, చిత్రా మిశ్రా, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం మకరంద్, ఆర్డీవోలు, ఏఈఆర్‌వోలు, అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ భారీ బైక్ ర్యాలీ భగ్నం

- పోలీసులు, నాయకుల మధ్య వాగ్వాదం, తీవ్ర తోపులాట
- సొమ్మసిల్లిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ



బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

సుభాష్‌నగర్ : సెప్టెంబర్ 17న తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలని బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అర్బన్ శాఖ ఆధ్వర్యంలో శనివారం నగరంలోని వినాయక్‌నగర్‌లోగల హనుమాన్ చౌరస్తాలో చేపట్టిన బైక్ ర్యాలీని పోలీసులు భగ్నం చేశారు. భారీ సంఖ్యలో అక్కడికి చేరుకున్న నాయకులు, కార్యకర్తలను పోలీసులు ర్యాలీ ప్రారంభం కాక ముందే అనుమతి లేదని అడ్డుకున్నారు. శాంతియుతంగా ర్యాలీని ముగిస్తామని నాయకులు చెప్పినా.. పోలీసులు విన్పించుకోలేదు. ఈక్రమంలో పోలీసులు, బీజేపీ నాయకుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. ఇరువురి మధ్య జరిగిన తోపులాటలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ధన్‌పాల్ సూర్యనారాయణ సొమ్మసిల్లిపడిపోయారు. అనంతరం పోలీసులు ధన్‌పాల్ సహా నాయకులు, కార్పొరేటర్లను అదుపులోకి తీసుకుని నాలుగో టౌన్‌కు తరలించారు. పోలీస్ వాహనాలను కార్యకర్తలు అడ్డుకుని నిరసన తెలిపారు.

బీఆర్‌ఎస్‌ను బొందపెట్టే రోజులు దగ్గర్లోనే.. : ధన్‌పాల్



ఉద్యమ సమయంలో టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తానని హామీనిచ్చిన సీఎం కేసీఆర్ మాటతప్పారని , బీఆర్‌ఎస్‌ను ప్రజలు బొందపెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని ధన్‌పాల్ సూర్యనారాయణ విమర్శించారు. సీఎం కేసీఆర్‌కు ఎంఐఎం భయం పట్టుకుందన్నారు. రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విమోచన దినాన్ని అధికారికంగా నిర్వహిస్తామన్నారు. ఆదివారం కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని పరేడ్ మైదానంలో హోంమంత్రి అమిత్ షా ఆధ్వర్యంలో విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు.
కార్యక్రమంలో నాయకులు, కార్పొరేటర్లు, మోర్చాల ప్రతినిధులు లక్ష్మీనారాయణ, మాస్టర్ శంకర్, పంచరెడ్డి శ్రీధర్, వినోద్‌రెడ్డి, ఇప్పకాయల కిషోర్, స్వామి యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, రోషన్, ఎడ్ల బాలకృష్ణ, అంతరెడ్డి హరీష్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, కార్యకర్తలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

క్లుప్తంగా

కొనసాగుతున్న నిరసన



తెయూ(డిచ్‌పల్లి): తమ సర్వీసులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ తెయూలో ఔట్‌సోర్సింగ్ సిబ్బంది చేపట్టిన నిరసన శనివారం మూడో రోజుకు చేరింది. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షుడు బట్టు సురేశ్ మాట్లాడుతూ.. తెయూలో పని చేస్తున్న 275 మంది ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని, గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు టీకోజీ, నరేశ్, రవీందర్ నాయక్, సుధీర్, సతీశ్, గులాబ్, బబ్లూ, పీరూ, మౌనిక, ఆసిఫ్, సాయి, గంగాధర్, క్రాంతి, దిగంబర్, గంగారాం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేరస్తులకు శిక్షపడేలా చూడాలి

- డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మీనర్సయ్య



ఖలీల్‌వాడి: పబ్లిక్‌ప్రాసిక్యూటర్లు శ్రద్ధతో విధులు నిర్వర్తిస్తూ నేరస్తులకు శిక్షపడేలా చూడాలని డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ పి. లక్ష్మీనర్సయ్య అన్నారు. నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ వైజయంతి ఆదేశాల మేరకు కోర్టులో విధులు నిర్వహిస్తున్న పబ్లిక్ ప్రాసిక్యూటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వైట్ కాలర్ నేరాలు, సాక్షుల సేకరణ చేసే విధానం, కేసుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. సమావేశంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎండీ రహీమొద్దీన్, భూసారపు రాజేశ్‌గౌడ్, అశోక్, శివరాం నాయక్, చిదిరాల రాణి, వీరయ్య, పారిక రాజేశ్వరి, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవిరాజ్, రాజరెడ్డి, కవిత రెడ్డి, కె. శేషు, అవారి రమేశ్, నిమ్మ దామోదర్‌రెడ్డి, డాక్టర్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ కిట్ వసూళ్ల పై విచారణ



రెంజల్(బోధన్): ప్రభుత్వ ఆస్పత్రుల్లో కాన్పుల సంఖ్యను పెంచేందుకు ప్రభుత్వం పలు పథకాలు అమలు చేస్తుండగా వాటిని అడ్డం పెట్టుకుని కొందరు అందినకాడికి దండుకుంటున్నారు. బాలింతలకు అందించే కేసీఆర్ కిట్ కోసం రెంజల్ ఆస్పత్రి ఫార్మసిస్టు బాధితుల వద్ద డబ్బులు వసూలు చేసినట్లు ఫిర్యాదులు రావడంతో బోధన్ డిప్యూటీ డీఎం అండ్‌హెచ్‌వో తుకారాం రాథోడ్ శనివారం ఆస్పత్రిలో విచారణ చేపట్టారు. విచారణ నివేదికను జిల్లా అధికారికి అందిస్తానని పేర్కొన్నారు. అనంతరం వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. రెంజల్‌లో ఒకరికి డెంగీ పాజిటివ్ వచ్చిందని సిబ్బంది గ్రామంలో అందుబాటులో ఉండి ప్రజలను అప్రమతం చేయాలని సూచించారు. వైద్యుడు వినయ్‌కుమార్, ఆరోగ్య విస్తరణ అధికారులు శ్రావణ్‌కుమార్, రవీందర్, సిబ్బంది ఉన్నారు.

వీరోచిత పోరాటంతో విమోచనం

- తెలంగాణ విమోచన ఉద్యమంలో జిల్లాకు సుస్థిర స్థానం
- వీరులకు పుట్టినిల్లు ఇందూరు

మోర్తాడ్(బాల్కొండ): నిజాం రజాకార్ల గుర్రపు డెక్కల చప్పుళ్లకు వెరవని ధీరులు మనవారు. రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని ఎదురించడానికి 1857లో జరిగిన సిపాయిల తిరుగుబాటు ఉద్యమంతో స్ఫూర్తిని పొందిన మన సమరయోధులు నిజాం నిరంకుశత్వంపై నిరసన గళం విప్పారు. మొదటి స్వాతంత్య్ర సంగ్రామంలో మన ప్రాంతానికి చెందిన కౌలాస్ రాజు దిలోప్ సింగ్ చూపిన పోరాట పటిమ, ఝాన్సీ లక్ష్మీబాయి ప్రదర్శించిన తెగువతో తెలంగాణ విమోచన కోసం సాయుధ పోరాటానికి నాంది పలికిన వారు కొందరు. అలాగే మహాత్మా గాంధీ బాటలో సత్యాగ్రహం ద్వారా స్వాతంత్య్ర ఉద్యమానికి ఊపిరిపోసిన వారు మరి కొందరు. ఇలా తెలంగాణ విమోచనం కోసం హింస, అహింస మార్గాల్లో వేర్వేరుగా పయనించిన యోధులకు పుట్టినిల్లు మన ఇందూరు గడ్డ.

నిజాం నిరంకుశత్వంతో నీరసించి పోయిన ప్రజలకు మనో ధైర్యాన్ని కల్పిస్తూ రక్తపుటేరులను పారించిన రజాకార్ల గుండెల్లో రైళ్లు పరిగెత్తించిన ఘన చరిత్ర మన సమరయోధులది. ఒకవైపు బ్రిటీష్ పాలనను ఎదురిస్తూ మరో వైపు నిజాం నిరంకుశ పాలనపై కత్తి ఎక్కుపెట్టిన ధీరత్వం మనవారి సొంతం. ఏకకాలంలో రెండు స్వాతంత్య్ర పోరాటాలు చేసిన ఘణత మనకే దక్కుతుంది. పల్లెలపై దాడులు చేస్తు అమాయక ప్రజల ధన, మాన ప్రాణాలను హరిస్తున్న రజాకార్ల గుంపుపై ఫిరంగులతో దాడికి పాల్పడిన మోర్తాడ్ జమీందార్ రుక్మారెడ్డిని దొంగచాటుగా బంధించి నిజాం పాలకులు ఇనుప సంకెళ్లతో బంధించి జైల్లో ఉంచారు. ఇదే



రజాకార్లపై నిప్పులు కురిపించిన ఫిరంగి


స్వాతంత్య్ర పోరాటంలో ఆర్య సమాజ్ ఆధ్వర్యంలో స్వామి రామానంద తీర్థ రాష్ట్ర కాంగ్రెస్ సత్యాగ్రహ ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. చౌట్‌పల్లి నారాయణరెడ్డి ఆర్య, చౌట్‌పల్లి శ్రీనివాస్‌రెడ్డి, పడిగెల హన్మాండ్లు, నారాయణ లింగారెడ్డి, నీలకంఠ నారాయణ, పడకల్ శ్రీనివాస్‌రెడ్డి, శంభులింగం, లక్ష్మాగౌడ్, బ్రహ్మయ్య, వెంకటస్వామి, బొంబాయి నర్సింహారెడ్డి, నర్సింహారావు, నరసింహాశాస్త్రి, కొండా నారాయణ, ఉప్పు లక్ష్మయ్య, జె. హన్మంత్ రెడ్డి, టి. రంగారెడ్డి రామానంద తీర్థ స్టేట్ కాంగ్రెస్ ఉద్యమానికి ప్రభావితులయ్యారు. ఉద్యమాన్ని ఉవెత్తుకు తీసుకెళ్లడానికి రామానందతీర్థకు ఎంతో సహకరించారు. 1947 ఆగస్టు 15న దేశమంతటా త్రివర్ణ పతాకం ఎగురవేయడానికి సన్నాహాలు జరుగుతుంటే నిజాం పాలనలో ఉన్న మనకు ఆ స్వేచ్ఛను రజాకార్లు హరించారు. కానీ మన సమర యోధులు మాత్రం వారి ఆజ్ఞలను లెక్క చేయకుండా మువ్వన్నెల జెండాను రెపరెపలాడించారు. ఫలితంగా జైలు ఊచలు లెక్కించారు.



ఉద్యమకారులకు అవాసమైన మోర్తాడ్ బురుజు

ప్రజాసేవలో తరించిన ఉద్యమకారులు..

తెలంగాణ విమోచన ఉద్యమంలో పాలుపంచుకున్న ఉద్యమకారులు విమోచనం తరువాత రాజకీయాల్లో చేరి ఉన్నత పదవులను అలంకరించారు. ఉద్యమస్ఫూర్తితో ప్రజాసేవలో తరలించినవారిలో మోర్తాడ్ మండలం సుంకెట్‌కు చెందిన ఎం. నారాయణరెడ్డి ఎంపీగా, ఎమ్మెల్యేగా జిల్లా అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. జక్రాన్‌పల్లి మండలం అర్గుల్‌కు చెందిన బడుగుల నేతగా గుర్తింపు పొందిన అర్గుల్ రాజారాం బాల్కొండ నియోజకవర్గానికి నాలుగుమార్లు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించడంతో పాటు చేనేత, ఆర్థిక, విద్యుత్‌శాఖ మంత్రిగా విశిష్టమైన సేవలు అందించారు. చౌట్‌పల్లికి చెందిన హన్మంత్‌రెడ్డి తెలంగాణ విమోచన ఉద్యమంలో గ్రామీణ ప్రాంత యువకులను సమీకరించి ఉద్యమాన్ని ముందుకు నడిపించారు.



అర్గుల్ రాజారాం, మాజీ మంత్రి(ఫైల్)



ముస్కు నారాయణరెడ్డి, మాజీ ఎంపీ(ఫైల్)

ఉద్యమానికి అవసరమైన ఆర్థిక సహకారం అందించారు. తెలంగాణ విలీనం అనంతరం జిల్లా పరిషత్ మొదటి చైర్మన్‌గా ఎంపికై ప్రజాసేవలో కొనసాగారు. వీరితో పాటు అనేక మంది తమ సొంత గ్రామాల్లో సర్పంచులు, సహకార సంఘాల చైర్మన్లుగా ఎంపికై ప్రజలకు విశేషమైన సేవలు అందించారు.

సిరికొండలో సాయుధ పోరాట ఛాయలు

సిరికొండ: మండలంలో తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట చాయలు నేటికీ కదలాడుతున్నాయి. ఆనాటి ప్రజలు నేటికి గత స్మృతులను నెమరువేసుకుంటున్నారు. కరీంనగర్ జిల్లా సిరిసిల్ల ప్రాంతానికి చెందిన అణభేరి ప్రభాకర్ రావు నేతృత్వంలో మండలంలో సాయుధ పోరాటం జరిగినట్లు నాటి పెద్దమనుషులు చెబుతారు. ప్రభాకర్ సారథ్యంలో అదే సిరిసిల్లకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు అమృత్‌లాల్ శుక్లా, శివాయిపల్లెకు చెందిన బల్‌రాం ఇక్కడ రజాకార్లకు వ్యతిరేకంగా పోరాటాలు సాగించారు. రజాకార్ల ఆకృత్యాలకు వేదికగా మారుతోందని హోన్నాజీపేట్ గడిపై వీరి ముఠా దాడి చేసింది. దాడితో గడి దొర ప్రతాప్‌రెడ్డి హైదరాబాద్‌కు పారిపోయాడు. గడిలో ఉన్న వ్యవసాయ పరికరాలను వారు ఎతుకెళ్లి గడిని తగులబెట్టారు. ఈ ఘటనతో గడిలో కొద్ది భాగం ధ్వంసమైంది. ప్రభాకర్‌రావు బృందం మండలంలోని పలు గ్రామాల్లో స్థావరాలను ఏర్పాటు చేసుకొని భూస్వాముల చెరలో ఉన్న భూములను పేదలకు పంచిపెట్టారు. మండలంలోని కొండాపూర్, తూంపల్లిలో రెండు వందలు, తాట్‌పల్లిలో వంద, కమ్మర్‌పల్లి మండలం మానాలలో ఐదు వందలు, మాచారెడ్డి మండలం రత్నగిరిపల్లెలో యాభై ఎకరాల భూములను భూస్వాముల చెర నుంచి విడిపించి పేదలకు పంచిపెట్టారు. రామారెడ్డి మండలం రెడ్డిపేట్ గ్రామంలో దాడి చేసి గ్రామ రికార్డులను దహనం చేశారు. వీరి సారథ్యంలో ఉద్యమం నడుస్తుండగా రజాకార్లకు పన్నులు కట్టడం, పశువులు మేపుకొనేందుకు చెల్లించే పన్నులను చెల్లించడం మానివేశారు. అలాగే గడ్కోల్‌లో దొరల వద్ద గుమాస్తాగా పని



చేసే జంగం గంగన్నను ఉద్యమకారులు గ్రామ నడిబొడ్డున కాల్చి చంపారు. మండలంలోని ఆయా గ్రామాల్లో 1946 నుంచి 1951 వరకు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం విస్తృతంగా సాగినట్లు చరిత్ర చెబుతోంది.

రజాకార్లను గడుగొమ్ములతో ఉరికించినం



"మన దేశాన్ని పట్టి పీడించిన బ్రిటీషోళ్లు వెళ్లిపోయింర్రని రేడియోల్లో వార్తలు విని 1947 ఆగస్టు 15న మొదటిసారి శెట్‌పల్లిలో జెండాను ఎగురవేశాం. అప్పటికి నా వయస్సు 24 సంవత్సరాలు. నా భర్త మా ఊరి జమీందారులతో కలిసి తెలంగాణ విమోచన ఉద్యమంలో పాల్గొంటుండే. బ్రిటీష్ సైన్యం ఇంటిదారి పట్టినా నిజాం రజాకార్లు మాత్రం ఊర్లల్లో జెండాలను ఎగురవేయొద్దని హుకుం జారీ చేసింర్రు. కానీ మేము అవేమీ పట్టించుకోలేదు. ధర్మోరా, శెట్‌పల్లిలో ఎంతో మంది రజాకార్లను ఎదురించాం. వాళ్లలో నా భర్త ఉండడం సంతోషంగా ఉంది. నా భర్తను రజాకార్లు కర్రలతో కొట్టింర్రు. మా చేతిలో ఆయుధాలు లేకపోయినా గడుగొమ్ములతో వారి దాడిని ఎదురించి రజాకార్లను ఉరికించినాం. మా పోరాటం గురించి తెలుసుకున్న ప్రభుత్వం నన్ను సత్కరించింది. ప్రతి నెలా స్వాతంత్య్ర సమరయోధులకు ఇచ్చే పింఛన్‌ను మంజూరు చేసింది. ఇప్పటికీ ప్రతి జెండా పండుగకు జిల్లా కేంద్రానికి రమ్మని లెటర్లు పంపిస్తుంర్రు."

– తక్కళ్లపల్లి రాజుబాయి, స్వాతంత్య్ర సమరయోధురాలు, శెట్‌పల్లి

ఓటరు నమోదు పక్కాగా ఉండాలి

- జిల్లా ఎన్నికల పరిశీలన అధికారి క్రిస్టీనా జడ్ చోంగ్తూ

బాల్కొండ/ ఆర్మూర్‌టౌన్/ ఎడపల్లి(బోధన్)/ వర్ని/ ఇందల్వాయి: ఓటరు నమోదు పక్కాగా ఉండాలని జిల్లా ఎన్నికల పరిశీలన అధికారి క్రిస్టీనా జడ్ చోంగ్తూ అన్నారు. జిల్లాలోని బాల్కొండ, ఆర్మూర్, ఎడపల్లి, బోధన్, వర్ని, ఇందల్వాయి పలు ఓటరు నమోదు కేంద్రాలను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతుతో కలిసి శనివారం పరిశీలించారు. బాల్కొండ మండలం శ్రీరాంపూర్‌లో, ఆర్మూర్ మున్సిపల్ పరిధిలోని పెర్కిట్‌లో, ఎడపల్లి మండలం జానకంపేట్‌లో, వర్ని మండలం జూనియర్ కళాశాలలో, ఇందల్వాయి మండలం చంద్రాయన్‌పల్లిలో పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఓటరు నమోదు కార్యక్రమాన్ని తనిఖీ చేసి అధికారులను పలు వివరాలు అడిగి తెలుసుకున్నారు. బోగస్ ఓట్లకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. వారి వెంట జిల్లా అదనపు కలెక్టర్ చిత్రా మిశ్రా, నిజామాబాద్ ఆర్డీవో వినోద్ కుమార్, బాల్కొండ తహసీల్దార్ శ్రీధర్, ఆర్మూర్ తహసీల్దార్ శ్రీకాంత్, ఎడపల్లి తహసీల్దార్ మోతీ సింగ్, బోధన్ ఆర్డీవో రాజాగౌడ్, బాన్సువాడ, వర్ని తహసీల్దార్లు నారాయణ, ప్రసాద్, ఇందల్వాయి తహసీల్దార్ వెంకట్‌రావు, అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది ఉన్నారు.



శ్రీరాంపూర్‌లో వివరాలు తెలుసుకుంటున్న జిల్లా ఎన్నికల పరిశీలన అధికారి క్రిస్టీనా జడ్ చోంగ్తూ

ఉత్తమ జీపీగా ఆలూర్

పెర్కిట్(ఆర్మూర్): స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023 సంవత్సరానికి ఆలూర్ ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎంపికైనట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో శ్రీనివాస్ శనివారం తెలిపారు. జిల్లాలోని 535 జీపీల నుంచి పారిశుధ్య నిర్వహణలో ముందున్న 15 గ్రామ పంచాయతీలను ఉత్తమ గ్రామ పంచాయతీలుగా అధికారులు ఎంపిక చేశారు. అందులో ఆలూర్ మండల కేంద్రం ఉత్తమ జీపీగా ఎంపికైంది. తమ గ్రామం ఉత్తమ జీపీగా ఎంపిక కావడంపై సర్పంచ్ కళ్లెం మోహన్‌రెడ్డి, ఉప సర్పంచ్ దుమ్మాజీ శ్రీనివాస్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆలూర్ శ్రీనివాస్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

అందరి సహకారంతోనే 'లోక్ అదాలత్' విజయవంతం

జిల్లా జడ్జి సునీత కుంచాల

ఖలీల్‌వాడి: అందరి సహకారంతోనే జాతీయ లోక్ అదాలత్ విజయవంతమైందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల అన్నారు. శనివారం నగరంలోని జిల్లా కోర్టులో ఏర్పాటు చేసిన సక్సెస్ మీట్‌లో జడ్జి మాట్లాడారు. ఈ నెల9న నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ విజయవంతంలో ప్రతి ఒకరి భాగస్వామ్యం ఉందన్నారు. న్యాయవ్యవస్థ, ప్రభుత్వ శాఖల సమష్టి కృషితో ఈ సారి అత్యధిక సంఖ్యలో కేసులను రాజీమార్గంలో పరిష్కారించినట్లు తెలిపారు. అనంతరం సీపీ సత్యనారాయణ మాట్లాడుతూ.. అమెరికా చికాగో నగరంలో చిన్న, చిన్న నేరాలకు రెండు రోజులకు మించి జైలుశిక్షలు ఉంటాయని మన దగ్గర ఇలాంటి శిక్షలు ఉంటే నేరాలు తగ్గే అవకాశం ఉందన్నారు. అనంతరం జడ్జి సంస్థ డీఎల్ఎస్ఏ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి పద్మావతితో కలిసి సీపీ సత్యనారాయణకు ప్రశంసాపత్రం అందజేశారు. కోర్టు పోలీస్, అదనపు పోలీస్ కమిషనర్ జయరామ్, ట్రాఫిక్ అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ నారాయణ, బీమా కంపెనీల న్యాయవాది సదానంద గౌడ్, సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్లు సయ్యద్ ఖాదీర్, ఉదయ కుమార్, వెంకటేశ్, మీర్ మహమ్మద్ సిరాజ్, ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబుకు ప్రశంసాపత్రాలు అందించారు. కార్యక్రమానికి సమన్వయకర్తగా న్యాయసేవ సంస్థ సూపరింటెండెంట్ పురుషోత్తంగౌడ్ వ్యవహరించారు.



మాట్లాడుతున్న జడ్జి సునీత కుంచాల

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా జడ్జి సునీత కుంచాల అన్నారు. శనివారం స్నేహ సొసైటీ సహకారంతో న్యాయసేవా సంస్థ జిల్లాకోర్టు ప్రాంగణంలోని న్యాయసేవ సదన్‌లో నిర్వహించిన న్యాయవిజ్ఞాన సదస్సులో ఆమె సెక్స్ వర్కర్స్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఆర్థిక, సామాజిక, ఇతర పరిస్థితులతో సెక్స్ వర్కర్లుగా మారిన వారు ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. సదస్సులో సీపీ సత్యనారాయణ, జిల్లా సహకార శాఖ అధికారి సింహాచలం, అసిస్టెంట్ కార్మిక శాఖ అధికారి యోహాన్, న్యాయసేవా సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, అదనపు పోలీస్ కమిషనర్ జయరామ్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ రమేశ్, స్నేహ సొసైటీ అధ్యక్షుడు సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్‌కు జిల్లా జడ్జి ప్రశంసలు

ఆర్మూర్‌టౌన్: లోక్ అదాలత్‌లో అధిక కేసులు పరిష్కరించినందుకు ఆర్మూర్ రెండో తరగతి మెజిస్ట్రేట్ వకులాభరణం వెంకటేశ్‌కు జిల్లా జడ్జి సునీత ప్రశంసాపత్రాన్ని జిల్లా కోర్టులో శనివారం అందజేశారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

రెజ్లింగ్‌లో కోటగిరి విద్యార్థి ప్రతిభ

రుద్రూర్: కోటగిరి మైనారిటీ జూనియర్ కళాశాల విద్యార్థి బి. బసవేశ్వర్ ఉమ్మడి జిల్లా స్థాయి రెజ్లింగ్ పోటీల్లో ప్రథమ బహుమతి గెలుపొందాడు. ఉమ్మడి జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహించారు. కళాశాలలో ఎంపీసీ ఫస్టియర్ చదువుతున్న బసవేశ్వర్ వరంగల్‌లో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ముబీన్ తెలిపారు. అనంతరం బసవేశ్వర్‌ను అధ్యాపకులు అభినందించారు.



బసవేశ్వర్‌ను అభినందిస్తున్న అధ్యాపకులు

కొనసాగుతున్న సమ్మె

వర్ని(మోస్రా): మండల కేంద్రంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు చేపట్టిన సమ్మె శనివారం ఆరో రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు ర్యాలీ నిర్వహించి అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రాన్ని అందజేశారు. తమ సమస్యలను ప్రభుత్వం పరిష్కరించేంత వరకు పోరాటం కొనసాగిస్తామని పేర్కొన్నారు. ర్యాలీలో అంగన్‌వాడీ ఉపాధ్యాయుల చిన్నారులు సైతం ర్యాలీ చేపట్టారు. సమ్మెలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నన్నేసాబ్, అంగన్‌వాడీ ఉద్యోగులు కరుణాదేవీ, సుజాత, ఎలిజబిత్ రాణి, సురేఖ, భాగ్యలక్ష్మి, జయశ్రీ, నాగమణి, అనురాధ, హైమది, రూప పాల్గొన్నారు.

క్రైం కార్నర్

వేర్వేరు ప్రమాదాల్లో ముగ్గురి మృతి

భిక్కనూరు: మండల కేంద్రానికి చెందిన పెంటకాడి అశోక్ (42) రైలు ఢీకొని మృతి చెందినట్లు రైల్వే ఎస్సై తావునాయక్ శుక్రవారం తెలిపారు. సిద్ధరామేశ్వరాలయం గేట్ సమీపంలో మృతదేహం ఉన్నట్లు సమాచారం మేరకు పరిశీలించినట్లు చెప్పారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు.

రాజంపేటలో యువకుడు..

రాజంపేట: రాజంపేట మండల పరిధిలోని తలమడ్ల రైల్వే స్టేషన్ సమీపంలో భిక్కనూర్ మండలం కాచాపూర్ గ్రామానికి చెందిన భూమని భరత్ (19) రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు రైల్వే ఎస్సై తావునాయక్ తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

రెండు బైక్‌లు ఢీ: ఒకరు..

పిట్లం(జుక్కల్): మండల కేంద్రంలోని రహదారిపై రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన హన్మంత్‌రెడ్డి (66) మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. హన్మంత్‌రెడ్డి (66) పిట్లం సహకార సంఘంలో పని చేస్తున్నాడు. స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మరో బైక్ ఢీకొనడంతో మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



హన్మంత్‌రెడ్డి (ఫైల్)

స్వగ్రామానికి చేరిన మృతదేహం

డిచ్‌పల్లి(నిజామాబాద్‌రూరల్): బతుకుదెరువు నిమిత్తం దుబాయ్‌కు వెళ్లిన ఓ వ్యక్తి మతిస్థిమితం కోల్పోయి మృతి చెందడంతో మూడు నెలలకు స్వగ్రామానికి మృతదేహం చేరుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. డిచ్‌పల్లి మండలంలోని గొల్లపల్లికి చెందిన ఇందూరు మహేందర్ (49) బతుకు దెరువు నిమిత్తం గత ఏడాది ఆగస్టులో దుబాయ్‌కి వెళ్లాడు. అక్కడికెళ్లిన వారం రోజుల్లోనే మహేందర్ మతిస్థిమితం కోల్పోయి తప్పిపోయాడు. దుబాయిలో ఉన్న తోటి గ్రామస్తులు ఎంత వెతికినా అతని ఆచూకీ లభించలేదు. ఈ విషయమై మహేందర్ తండ్రి పెద్ద భూమయ్య దుబాయ్‌లో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఇంతలో జూన్‌లో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైందంటూ అక్కడి పోలీసులు స్థానిక మాధ్యమాల్లో ప్రసరించారు. విషయాన్ని గమనించిన గ్రామస్తులు మృతదేహాన్ని గుర్తించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. దీంతో గల్ఫ్ కార్మికుల రక్షణ సమితి ప్రతినిధులు గుండెల్లి నర్సింహులు, వెల్మల కిరణ్, గాడ్‌వంద్ నరేందర్ సహకారంతో మహేందర్ మృతదేహాన్ని ఇండియాకు తరలించారు. శనివారం రాత్రి మృతదేహం గొల్లపల్లికి చేరుకుంది. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. కుటుంబ రోదనలు మిన్నంటాయి. పేద కుటుంబానికి చెందిన మహేందర్ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్, ఎంపీటీసీ, గ్రామస్తులు కోరుతున్నారు.



మహేందర్ (ఫైల్)

నిందితుడి రిమాండ్

ఖలీల్‌వాడి: నగరంలోని ఓ బంగారు దుకాణంలో షటర్‌తాళం పగులగొట్టి బంగారం చోరీ చేసిన ఓ నిందితుడిని పట్టుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏసీపీ కిరణ్‌కుమార్ తెలిపారు. నగరంలోని కిషన్‌గంజ్‌లోని గోల్డ్‌షాపులో మిర్చికంపౌండ్‌కు చెందిన పర్మటి ఎల్లప్పా తాళం పగులగొట్టి 60 గ్రాముల బంగారాన్ని చోరీ చేసినట్లు పేర్కొన్నారు. నిందితుడు పాత నేరస్తుడని, జల్సాలకు అలవాటుపడి దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఏసీపీ చెప్పారు. గోల్డ్‌షాపు వర్కర్ మైదుల్ ముల్లా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఎస్‌హెచ్‌వో విజయ్‌బాబు, ఎస్సై విష్ణు ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

ఇందల్వాయి: మండలం కేంద్రంలోని జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గంగారాం తండాకు చెందిన రతన్‌కు తీవ్రగాయాలైనట్లు స్థానికులు తెలిపారు. తండాకు వస్తుండగా నిజామాబాద్ వైపు వెళ్తున్న తుఫాన్ వాహనం ఢీకొందన్నారు. బాధితుడిని చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

గంజాయిపై ఉక్కుపాదం

- మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలి
- సీపీ సత్యనారాయణ



మాట్లాడుతున్న సీపీ సత్యనారాయణ

ఖలీల్‌వాడి: రాష్ట్ర ప్రభుత్వం గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపేందుకు చర్యలు చేపట్టిందని పోలీస్ కమిషనర్ సత్యనారాయణ అన్నారు. దీని బారిన పడుతున్న యువత దూరంగా ఉంటేనే బాగుంటుందని లేకుంటే తమ జీవితాలు నాశనమవుతాయని పేర్కొన్నారు. నగరంలోని సీపీ కార్యాలయంలో గంజాయి నియంత్రణపై శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో గంజాయి బారిన పడ్డ యువత చాలా మంది ఉన్నారని వీటికి దూరంగా ఉండాలని సూచించారు. కొంతమంది డబ్బులు లేక మత్తు పదార్థాలను సరఫరా చేస్తున్నట్లు తెలిసిందని దీంతో తమ జీవితాలు నాశనమవుతాయని పేర్కొన్నారు. గంజాయి తరలిస్తున్న, గంజాయి సేవిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ప్రశాంత్‌రెడ్డి ఆదేశించినట్లు చెప్పారు. గ్రామాల్లో అన్ని వర్గాల వారిని భాగస్వాములు చేస్తూ గంజాయి నియంత్రణ కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. జిల్లాలో 2023లో 23 కేసుల్లో 53 మందిని అరెస్టు చేయగా 20 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ధర్మారం(బి)లో బైక్ చోరీ

డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) గ్రామంలో బైక్‌చోరీకి గురైనట్లు ఎస్సై మహేశ్ శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన వెంకటరమణ తన బైక్‌ను రాత్రి ఇంటి ఎదుట నిలిపి ఉంచాడు. ఉదయం లేచి చూసే సరికి బైక్ కనిపించలేదు. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఆయిల్ ..

నిజాంసాగర్(జుక్కల్): మండలంలోని ఆరేడ్ గ్రామంలో ఉన్న రెండు ట్రాన్స్‌ఫార్మర్లను దుండగులు ధ్వంసం చేసి అందులోని ఆయిల్, కాపర్ వైర్లను దొంగిలించినట్లు స్థానిక రైతులు శనివారం తెలిపారు. పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు రైతులు పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిన దుండుగలను శిక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.